క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



వెంకటాపురం(కె): వెంకటాపురం సీఐగా ఆదివారం ముత్యం రమేశ్ బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ బండారు కుమార్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆసిఫాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న రమేశ్ ఇక్కడికి వచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన బోధించుటకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో పీజీసీఆర్టీ ఫిజిక్స్, తెలుగు సబ్జెక్టులను బోధించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్థానికులైన మహిళలు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 29 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అలాగే ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పాట్ అడ్మిషన్లు

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్మీడియేట్‌లో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గుండు కుమార్ తెలిపారు. జూలై 30 నుంచి ఆగస్టు 3 వరకు టీసీ, స్టడి సర్టిఫికేట్‌తో విద్యార్థులు హాజరు కావాలని అన్నారు. మరిన్ని వివరాలకు 80963 50115 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కన్నాయిగూడెం: మండలంలోని ఏటూరు, కన్నాయిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు (సోమవారం), రేపు(మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ డీఈ సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన పుట్ట రాజయ్య, రాజనాల స్వామి, ధర్మక్క ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలకు మాజీ సర్పంచ్ ఎరవెల్లి విలాస్‌రావు ఆదివారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఏఎస్సై

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన దేవరకొండ రాజు ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు సీఈఐఆర్ ద్వారా కానిస్టేబుల్ లాల్‌సింగ్ సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి ఏఎస్సై మధుసూదన్ చేతుల మీదుగా బాధితుడికి ఆదివారం అందజేశారు.

అసంపూర్తిగా నిర్మాణం

కురుస్తున్న భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం కొనసాగింపు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ నూతన కార్యాలయ భవనం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కనే తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉందని 2023 సంవత్సరంలో కొత్త భవనం నిర్మించడానికి పాత భవనాన్ని కూల్చివేశారు. అందరికి అందుబాటులో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా కిలోమీటర్నర దూరంలో తాత్కాలికంగా ప్రభుత్వ భవనంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన రెవెన్యూ కార్యాలయం అడవికి దగ్గరల్లో ఉండడంతో కార్యాలయానికి వెళ్లడానికి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రెండేళ్లు కావస్తున్న కార్యాలయం అక్కడే ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం కురుస్తున్నప్పటికీ అందులోనే విధులు కొనసాగిస్తున్నారే తప్పా ప్రజలకు చేరువలో కార్యాలయాన్ని ఏర్పాటు చేద్దామని అధికారులకు, పాలకులకు కలగడం లేదు.

పనులు నిలిపేసిన కాంట్రాక్టర్

తహసీల్దార్ భవన నిర్మాణానికి గత ఏడాది ప్రభుత్వం రూ.63 లక్షల నిధులు మంజూరు చేయగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్లాబ్ పోసి నిధులు లేవని నిలిపివేశాడు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి నిధుల కోసం వేచి చూడాలి కానీ సంబంధిత కాంట్రాక్టర్ తనకేమి పట్టనట్లుగా నిధులు వస్తేనే పనులు చేస్తామని నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారు. అధికారులు కూడా కాంట్రాక్టర్‌తో పనులు చేయించడం లేదని స్థానికులు వాపోతున్నారు.



శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

యాచకులకు నిలయంగా నూతన భవనం

అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయం యాచకులకు నిలయంగా మారింది. ఇప్పటి వరకు కూడా కాంట్రాక్టర్, అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో భవనం మళ్లీ శిథిలవస్థకు చేరే ప్రమాదం ఉంది. ఈ భవనం పూర్తి అయితే రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్ ఒకే చోట ప్రజలకు సేవలు అందించే అవకాశం ఉంది. కానీ భవనం ఇలాగే ఉండిపోతే ప్రజల కల... కలగానే నిలిచిపోనుంది.

ఇబ్బందులు పడుతున్నాం..



పక్కా భవనం లేక ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు నుంచి లోపటికి నడుచుకుంటూ రావాలి అంటే అవస్థలు పడాల్సి వస్తోంది. అక్కడ ఆఫీస్‌లో అధికారులు ఉంటారో లేదో అన్న విషయం కూడా తెలియని పరిస్థితి.

– బట్టు నర్సింహరావు, రైతు, ఏటూరునాగారం

ఇరుకు గదుల్లో కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం ఇరుకు గదుల్లో ఉంది. దాని వల్ల పరిపాలన సక్రమంగా సాగడం లేదు. సమస్యలు చెప్పుకుందామంటే అక్కడ నిలబడి వివరించే పరిస్థితి లేదు. ఇబ్బందులు పడుకుంటూ అక్కడి వెళ్లి పనులు చేయించుకోవాల్సి వస్తోంది.

– సునారికాని భిక్షపతి, రైతు, ఏటూరునాగారం

నివేదిక అందజేశాం..

భవనం పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. నిధులు సమకూర్చి పనులు వేగవంతం చేసేందుకు తమవంతు చర్యలు చేపడుతున్నాం. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– జగదీశ్వర్, తహసీల్దార్, ఏటూరునాగారం

ప్రమాదకరంగా రహదారులు



గిరిజన పెట్రోల్ బంక్ కల్వర్టు వద్ద వరద కోతకు గురైన రోడ్డు



కోమటిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పడిన గుంతలు

మంగపేట: నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని గంపోనిగూడెం సమీపంలోని గిరిజన పెట్రోల్ బంక్ వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నిర్మించిన కల్వర్టు కోతకు గురైంది. సగానికి పైగా కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. అదే విధంగా కోమటిపల్లి క్రాస్ రోడ్డు వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు ఏ మాత్రం స్పందించక పోవడం గమనార్హం. నిత్యం వందలాది ఆర్టీసీ బస్సులు, స్కూలు బస్సులు, ఇసుక లారీలు, ఇతర ప్రైవేట్ వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానిక పోలీసులు రెండు ప్రమాదకర స్థలాల్లో బారికేడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇదే విధంగా మండలంలోని కమలాపురం నుంచి బ్రాహ్మణపల్లి వరకు ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాద కరంగా తయారైంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకుడు పూనెం రామచందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఆదివాసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ దినోత్సవ వేడుకలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద నిర్వహించే వేడుకలకు ఆదివాసీ నాయకులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం చంటి, గుర్రపు రామారావు, పర్శిక సతీశ్, గొంది హనుమంతు, రేగ గణేష్, వెంకటకృష్ణ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎస్ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న మంత్రి సీతక్క



వెంకటాపురం(ఎం): పరామర్శిస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చుపటేల్ తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంత్రి సీతక్క, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కుంజ సూర్య ఆదివారం పరామర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని అల్లుర్లపల్లి గ్రామానికి చెందిన మాట్ల కరుణాకర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, రెడ్కో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు రమేశ్, గై అశోక్, పోశాల వీరమల్లు, ఆశాడపు దేవేందర్, నర్రా భద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శీలం మధు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో ప్రవీణ్‌కుమార్

వాజేడు: స్కావెంజర్స్ మండల నూతన కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షుడు యనమల్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా గార పద్మ, ఉపాధ్యక్షులుగా సప్క వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా నల్లెబోయిన సారమ్మలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలు గార పద్మ మాట్లాడుతూ.. స్కావెంజర్లకు పేరు నమోదు రిజిస్టర్ పెట్టాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సురక్షిత ప్రదేశాల్లో చేపలు పట్టాలి

రేగొండ: భారీ వర్షాల నేపథ్యంలో చేపలు పట్టేవారు నీటి పరిస్థితులను అంచనా వేస్తూ, సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే చేపలు పట్టాలని ఎస్సై సాకపురం దివ్య అన్నారు. ఆదివారం కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట బ్రిడ్జి వద్ద పలువురు చేపలు పడుతుండడంతో నీటి ప్రవాహం ఎక్కువై కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వారిని హెచ్చరించారు. చేపలు పట్టేటప్పుడు ప్రమాదాలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలోని కాకతీయ హైస్కూల్ 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎల్లావుల అశోక్, రాజేందర్, దిలీప్, ఇమ్మడి భిక్షపతి, కిరణ్, రవిరాజ్, చంద్రశేఖర్, బైకాని వేణు, గొర్రె రఘుపతి, సునీల్, నరేష్, జక్కుల రమేశ్ పాల్గొన్నారు.

వద్దన్నా రుణం.. ఆపై వేధింపులు

రేగొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు లోన్ యాప్ ఉచ్చులో పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. యువకుడు తన అవసరాల కోసం ప్లే స్టోర్ నుంచి రేటింగ్ బాగుంది కదా అని ఓ అప్లికేషన్‌ను తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఆధార్, పాన్‌కార్డు, తప సెల్ఫీతో పాటు పూర్తి వివరాలు ఎంట్రీ చేశాడు. కానీ వడ్డీ ఎక్కువగా ఉండటంతో లోన్ వద్దనుకున్నాడు. అయినప్పటికీ తన అకౌంట్‌లో యాప్ నిర్వాహకులు రూ.10 వేల నగదు జమ చేశారు. డబ్బులు జమ అయిన వారం రోజుల తరువాత లోన్ వడ్డీతో కలిపి రూ.18 వేలు కట్టాలంటూ వాట్సాప్ కాల్స్, మెసేజులు రావడం మొదలయ్యాయి. దీంతో బాధితుడు 10 వేలు చెల్లిస్తా మిగతా అమౌంట్‌కు సమయం కావాలని కోరాడు. మొత్తం డబ్బులు కట్టాలంటూ ఒత్తిడి తేవడమే కాకుండా.. ఫోన్‌చేసి బూతులు తిడుతుండటంతో బాధితుడు సైబర్ క్రైం పోలీస్‌లను ఆశ్రయించాడు. అంతటితో ఆగని దుండగులు తన పూర్తి వివరాలు తమ దగ్గర ఉన్నాయని, న్యూడ్ ఫొటోలు ఫోన్‌లోని కాంటాక్ట్‌లకు పంపుతామని బెదిరింపులకు గురి చేసినట్టు తెలిపాడు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

వెంకటాపురం(కె) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీశ్, శ్రీను, నరేష్, సాయి చంద్, శ్రీకిషన్ తదితరులు ఉన్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నాలుగు విడతలుగా బిల్లులు చెల్లింపు
- నేరుగా ఖాతాల్లో జమ



టేకుమట్లలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇల్లు

టేకుమట్ల: తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేస్తుంది. మండలంలో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మండల కేంద్రంలో 40 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కాగా ఇంటి నిర్మాణాలను ప్రారంభించగా ఇప్పటికే పలువురు లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసుకున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించడంతో పనులను వేగవంతం చేస్తూ ఇంటి నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు మొత్తం 360 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు.

నాలుగు దఫాలుగా నిర్మాణ బిల్లులు..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండానే స్థానిక పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈ, హౌసింగ్ డీఈలు నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ బేస్‌మెంట్ పూర్తి అయ్యాక రూ.లక్ష, రూఫ్ లెవల్ గోడలు పూర్తి అయ్యాక రూ.లక్ష, స్లాబ్ పూర్తి అయ్యాక రూ.రెండు లక్షలు, ప్లాస్టరింగ్, బాత్ రూంల నిర్మాణం పూర్తి అయ్యాక రూ.లక్ష ఇలా మొత్తం రూ. ఐదు లక్షల నగదును దశల వారిగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇళ్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



స్లాబ్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

త్వరగా నిర్మించుకోవాలి



మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపిక పత్రాలను అందించాం. ఇప్పటికే చాలా మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేశారు. కాస్త ఆలస్యంగా నిర్మాణాలను చేస్తున్న వారిని నిత్యం పర్యవేక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచిస్తున్నాం. బిల్లుల చెల్లింపులో ఎలాంటి అపోహలకు లోనుకావొద్దు. నిర్మాణాలు చేస్తున్న అందరికీ బిల్లులు వస్తాయి. లబ్ధిదారులు తొందరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి.

– శ్రీకాంత్, హౌసింగ్ డీఈ

రూ.4లక్షలు వచ్చాయి..



మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశా. నాకు ఇప్పటి వరకు మూడు దశల్లో రూ.4లక్షలు వచ్చాయి. చివరి బిల్లు వస్తే మొత్తం రూ.5లక్షలు వచ్చినట్లు. ఎవరి ప్రమేయం లేకుండా బిల్లులు రావడం సంతోషంగా ఉంది.

– మాచర్ల శ్రీనివాస్, టేకుమట్ల

ముమ్మరంగా వాహనాల తనిఖీ



రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్



సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద పహారా కాస్తున్న పోలీసులు

కన్నాయిగూడెం: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని ప్రధాన రోడ్లపై ఎస్సై వెంకటేశ్ ఆదివారం తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గొత్తికోయగూడెంలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

సమ్మక్క సాగర్ బ్యారేజీ ప్రాంతంలో భద్రత

తుపాకులగూడెం గ్రామ పంచాయతీలోని గోదావరిపై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద పోలీసులు భద్రతను పెంచారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి దగ్గరగా ఉన్నందన పోలీసులు నిఘా ఉంచారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సీఆర్పీఎఫ్ సిబ్బందితో భద్రతను పటిష్టం చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

ఫొటో గ్రాఫర్లకు శిక్షణ తరగతులు



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఫొటో గ్రాఫర్లకు శిక్షణ తరగతులను డివిజన్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను జయమాధూరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హుస్సేన్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తి, గడదాస్ సునీల్ కుమార్, దయాకర్, శ్యామ్, రాజేష్, వాసుదేవ్,సర్వేశ్వరావు, గోపి, తదితరులు ఉన్నారు.